క్లుప్తంగా

అధ్వానంగా రహదారి

అశ్వాపురం: మండల కేంద్రంలో అశ్వాపురం చర్చి రోడ్డు రహదారి మంగళవారం కురిసిన చిన్న వర్షానికే బురదమయమై అధ్వానంగా ఉంది. చినుకులు పడినా రహదారి చిత్తడిగా మారి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా రహదారి అధ్వానంగా ఉండి పిల్లలు, వృద్ధులు, మహిళలు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారని, రహదారి సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

బూర్గంపాడు: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీఆర్ఎస్ నాయకుల అనుచిత వ్యాఖ్యలు సరికాదని పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆవుల నాగిరెడ్డి అన్నారు. లక్ష్మీపురంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పొంగులేటికి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికలలో బీఆర్ఎస్.కు అన్ని నియోజకవర్గాలలో ఓటమి తప్పదన్నారు.మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మీపురం, మోరంపల్లిబంజర ఉపసర్పంచ్‌లు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కైపు లక్ష్మీనారాయణరెడ్డి, పాలం లక్ష్మీరెడ్డి, కై పు నాగిరెడ్డి, తేజావత్ నరసింహ, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, చిప్పా రాజు, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ములకలపల్లి: హమాలీ కార్మికుల కోసం ప్రత్యేకంగా సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు అన్నారు. సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ములకలపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. హమాలీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు నకిరకంటి పుల్లారావు, గద్దం వెంకటేశ్వర్లు, నల్లి రామారావు, మిరియాల వెంకన్న, పసుపులేటి వెంకన్న, జగలం సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

కరకగూడెం: మండలంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి సీహెచ్.కుమారస్వామి ఆధ్వర్యంలో మంగళవారం భట్టుపల్లి గ్రామ పంచాయతీలో నిర్వహించారు. శిబిరంలో సుమారు 155 మంది గ్రామస్తులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తోలెం నాగేశ్వరరావు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

కరకగూడెం: విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు చిల్లుపెడుతూ విద్యరంగాన్ని వ్యాపారంలా నిర్వహిస్తున్న జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం ప్రభుత్వం అమలు చేయాలని నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం తాటిగూడెం గ్రామంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యా సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, దుస్తులు, పుస్తకాలు, ఇతరత్ర సామగ్రిని అదే పాఠశాలలో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. వాహనాల్లో విద్యార్థుల్లో విద్యార్థులను అధిక సంఖ్యలో ఎక్కిస్తున్నారని అన్నారు. సమావేశంలో నేతకాని విద్యార్థి సంఘం మండల నాయకులు దుర్గం సందీప్, జాడి ప్రకాష్, జిమ్మిడి వంశీ, రితీష్, వినయ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

జీలుగు విత్తనాలు పంపిణీ

బూర్గంపాడు: రైతులు ప్రభుత్వం రాయితీపై అందించే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. బూర్గంపాడు పీఏసీఎస్‌లో మంగళవారం రైతులకు రాయితీపై జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేయడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సిరిపురపు స్వప్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆవుల నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, జక్కం సుబ్రహ్మణ్యం, గొనెల నాని, మేడగం రామిరెడ్డి, సీతఊ ప్రసాద్, ఉమర్, తిరుపతిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

దమ్మపేట: శ్రీ గాయత్రీ ఆశ్రమంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మూర్తీజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించి, శాలువాతో మర్యాదపూర్వకంగా సత్కరించారు. అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, బాబు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సమీక్ష సమావేశాల్లో ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు


భద్రాచలంఅర్బన్: ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు


అశ్వారావుపేటరూరల్: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ లూథర్ విల్సన్

మణుగూరురూరల్: జూన్ 2వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పల్లెపల్లెనా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం గుట్టమల్లారంలోని హనుమాన్ ఫంక్షన్‌హాల్‌లో పినపాక నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అధికారులు ప్రజలను భాగస్వామ్యం చేస్తూ.. పండుగలా నిర్వహించాలని సూచించారు. రోజుకో కార్యక్రమం చొప్పున 21రోజుల తెలంగాణ సాధించిన విజయాలను ప్రజలకు తెలిసేలా నిర్వహించాలన్నారు. ప్రతీ గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. పదేండ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు తెలిసేలా ఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఫలాలపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీలు పోశం నరసింహారావు, సూదిరెడ్డి సులక్షణ, కామిరెడ్డి శ్రీలత, ఎంపీపీలు గుమ్మడి గాంధీ, రేగా కాళిక, పినపాక నియోజకవర్గంలోని మండలాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశించారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై పలు సూచనలు చేశారు. వీసికి ఎంపీపీ సున్నం లలిత, తహసీల్దార్ భద్రకాళి, ఎంపీడీఓ అన్నపూర్ణ, ఎంపీఓ షబ్నా, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది దుమ్ముగూడెం ఉత్సవాలను మండలంలో ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ రేసు లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో దశాబ్ది ఉత్సవాల కార్యాచరణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆమె మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలు సూచనలు చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీడీఓ ముత్యాలరావు, సీఐ దొమల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మంగళవారం తహసీల్‌లో తహసీల్దార్ లూథర్ విల్సన్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఉత్సవాల విజయవంతానికి చేయాల్సి విధివిధానాలను వివరించారు. సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీడీఓ, శ్రీనివాసరావు, డీఈ కృష్ణ, ఏవో నవీన్, ఏపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ సీతారామరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, ఏఈఓలు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవలపై మంగళవారం తహసీల్దార్ మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, సంస్థలు విధిగా పాల్గొని సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రత్యేకాధికారి బి.నాగలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, విద్యుత్ ఏఈ మైథిలి, గ్రామ పంచాయితీ ఈఓ వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఎం జె.జగదీష్‌తో పాటు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: తెలంగాణ రాష్ట్ర అవిర్భావ ఉత్సవాలు పండుగలా చేద్దామని ఎంపీపీ బాణోత్ పార్వతి అన్నారు. ఉత్సవాల నిర్వహణపై ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వర్ష రవికుమార్, ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు, మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, ఎంఈఓ ఎస్ సత్యనారాయణ, పశువైద్యాధికారి రాంప్రసాద్, ఎంపీఓ తోట తులసీరాం పాల్గొన్నారు.

కదిలిన వైద్య బృందం

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి పీహెచ్‌సీ పరిధిలోని వడ్డెర రంగాపురం గ్రామానికి ఎట్టకేలకు మంగళవారం వైద్య బృందం కదిలింది. గ్రామంలో జ్వరాలు విజృంభించడంపై 30వ తేదీన 'సాక్షి'దినపత్రికలో 'వణికిస్తున్న జ్వరాలు' శీర్షికన వచ్చిన కథనంపై వైద్య శాఖ స్పందించింది. పీహెచ్‌సీ వైద్యురాలు మధులిక ఆధ్వర్యంలో వడ్డెర రంగాపురం గ్రామంలోని రామాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మొత్తం 65 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మరో 12 మంది జ్వరపీడితులను గుర్తించారు. వారికి తగిన పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాగా గ్రామంలో మలేరియా కేసులు నమోదు కాలేదని, అందరికీ వైరల్ జ్వరాలు మాత్రమే ఉన్నాయని వైద్యాధికారి తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ పి.దుర్గమ్మ, ఏఎన్ఎం శాంతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


వడ్డెర రంగాపురంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

'సీతమ్మ' భూనిర్వాసితుల ధర్నా


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూనిర్వాసితులు

భద్రాచలంటౌన్: దుమ్ముగూడెం మండలంలోని సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ భూనిర్వాసితులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్ ప్రతాప్‌కు అందజేశారు. ఈ సందర్భంగా భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు కొమరం దామోదరావు మాట్లాడుతూ.. రెండో భూ సేకరణలో తీసుకుంటున్న భూమికి బదులు భూమిని లేకుంటే ఎకరానికి రూ.30 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కరకట్ట నిర్మాణ సమయంలో భారీ వాహనాలు తిరుగుతుండడంతో రైతులు వ్యవసాయం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి అయ్యే వరకు ఆ రైతులకు కౌలు ప్రభుత్వమే చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సాగి రామచంద్ర రాజు, నీలాద్రి వర్మ, సీతాపతి రాజు, కొప్పిసీడు బాబురావు, చిన్నారావు, రమణారావు, వెంకటేశ్వర్లు, మునిరెడ్డి, రామకృష్ణ, విజయలక్ష్మి, బుల్లెమ్మ పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే అంచనాలు పెంపు

అశ్వాపురం: తెలంగాణ ప్రభుత్వం కమీషన్ల కోసమే ప్రాజెక్టుల డిజైన్లు మార్చి అంచనాలు పెంచి ఆ డబ్బుతో ఎన్నికల్లో ఖర్చు పెడుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి అన్నారు. అశ్వాపురంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.3,400 కోట్లతో చేపట్టిన సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణం కేంద్రం నుంచి ఎలాంటి అనుమతులు లేక అర్ధాంతరంగా ఆగిపోయిందన్నారు. ప్రభుత్వం కమీషన్లు తీసుకొని ఎల్ అండ్‌టీ కంపెనీకి పనులు అప్పగించి నిర్వాసితులకు సరైన పరిహారం ఇవ్వక పరివాహక గ్రామాల ప్రజల అనుమానాలను నివృత్తి చేయలేదన్నారు.కరకట్టల నిర్మాణం జరిగితే మిగిలి ఉన్న భూములకు నీరు అందక భారీ వరదలు వస్తే తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రజలు, మేధావులు ఆలోచించి బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

ఆధ్యాత్మికత పెంపే లక్ష్యం

చర్ల: అన్ని ప్రాంతాల ప్రజల్లో ఆధ్యాత్మికత పెంపే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, ఈ క్రమంలోనే నూతన ప్రార్థనా మందిరాలను నెలకొల్పుతున్నామని డోర్నకల్ అధ్యక్ష మండల పీఠాధిపతి బిషప్ డాక్టర్ కె.పద్మారావు తెలిపారు. చర్ల మండలంలోని కుదునూరులో నిర్మించిన నూతన దేవాలయాన్ని మంగళవారం అధ్యక్ష మండల స్త్రీల మైత్రి అధ్యక్షురాలు కె.విజయకుమారితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం దుమ్ముగూడెం గ్రూప్ చైర్మన్ పి.రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పద్మారావు మాట్లాడుతూ అధ్యక్ష మండల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో విద్య, వైద్యసేవలందిస్తూనే దేవాలయాల నిర్మాణాలకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాట్లాడుతూ అధ్యక్ష మండల అభివృద్ధికి బిషప్ పద్మారావు చేస్తున్న కృషి అభినందనీయమని, ఏజెన్సీలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. డయాసిస్ బాధ్యులు, ఫాస్టర్లు జి.ప్రభాకరరావు, కె.శాంతకుమార్, బి.విశ్వం, బి.అభిజిత్, ఎస్.వెంకటరత్నం, ఎం.కృపావరం, ఆశీర్వాదంతో పాటు కాంగ్రెస్ నాయకుడు దుర్గాప్రసాదరావు పాల్గొన్నారు.


ఆలయ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న బిషప్ పద్మారావు

కుండపోత వర్షం

అశ్వారావుపేటరూరల్: మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోయి, ఉరుములు, మెరుపులతో కూడిన జోరు వర్షం పడింది. దాదాపు గంటన్నరపాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో మురుగు కాల్వలు పొంగిపొర్లాయి. మండలంలోని మల్లాయిగూడెం, కొండతోగు, వినాయకపురం, దబ్బతోగు, పేరాయిగూడెం, అశ్వారావుపేటతోపాటు పలు గ్రామాల్లో కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరింది.

స్విఫ్ట్ కారు గెలుచుకున్న సారపాక వాసి

భద్రాచలంఅర్బన్: ముత్తూట్ మినీ ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహించిన మెగా బంపర్ డ్రాలో భద్రాచలం బ్రాంచ్ కస్టమర్, సారపాక గ్రామానికి చెందిన జున్ను గిరిప్రసాద్ స్విఫ్ట్ కారు గెలుచుకున్నారు. సంస్థ ఎండీ మ్యాథ్యూ ముత్తూట్ మంగళవారం గిరిప్రసాద్‌కు కారు అందజేసి, అభినందనలు తెలిపారు.

బోను ఏర్పాటు చేయాలని వినతి

చండ్రుగొండ: పశువులకు వైద్యం చేసేటప్పుడు అనుకూలంగా ఉండే బోనును చండ్రుగొండలో ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి పెద్దిని వేణు కోరారు. ఈ మేరకు మంగళవారం పశువైద్యశాఖ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, ఆర్.వెంకటాచారి, పి.నరేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రేగాకు సన్మానం

మణుగూరురూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరణకు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. పినపాక నియోజకవర్గంలోని జూనియర్ పంచాయితీ కార్యదర్శులు మంగళవారం పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావును కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో సన్మానించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

అశ్వారావుపేటరూరల్: సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు.

స్థానిక గౌడ బజారులో ఆ సంఘం బాధ్యులు ఆరేపల్లి సాంబశివరావు ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన కులవృత్తుల వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రకటించడంపై సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు మోటూరి మోహన్, టి.సూరి, వేముల ప్రసాద్, గణపతి, ఆరేపల్లి రాములు, బుర్ర వెంకన్న, పల్లెల సుబ్బారావు, వెంకటేశ్వరరావు, కోటి శ్రీను, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

భద్రాచలం: రాజకీయాల్లో యువకుల పాత్రే ప్రధానమైందని, అందుకే నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. యూత్ కాంగ్రెస్ భద్రాచలం పట్టణ అధ్యక్షుడిగా అంబటి మణికంఠను నియమించారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పొదెం వీరయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఇప్పుడు రాజకీయాల్లో రాణించడానికి అప్పటి యూత్ కాంగ్రెస్‌లో పనిచేసిన అనుభవమే కారణమని నాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, నాయకులు బలుసు నాగసతీష్, సరెళ్ల వెంకటేష్, చింతిరేల సుధీర్, ప్రదీప్, మణికంఠ, రాంప్రసాద్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టీపీసీసీ సభ్యురాలు, ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పాదిలి జ్యోతి అన్నారు. మండల పరిధిలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి మహిళా కాంగ్రెస్ పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని మండలాల్లో మహిళా కాంగ్రెస్ మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వరంగల్ రైతు డిక్లరేషన్, హైదారాబాద్ యూత్ డిక్లరేషన్‌తోపాటు, పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే పథకాలపై ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ముష్టిన శిరీష, ఏసుమణి, గుర్రం జయసుధ, బడుగు కృష్ణవేణి, నాయకులు తుమ్మా రాంబాబు, మద్దిశెట్టి సత్యప్రసాద్, జుజ్జూరి దుర్గారావు, కొప్పుల శ్రీను, ఎస్‌కె.బాబా, ఉప్పల రాజశేఖర్, సత్యం రామకృష్ణ, నల్లపు జగన్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమ్మెకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: బీటీపీఎస్ కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని, జెన్‌కో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని బీటీపీఎస్ వద్ద కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి తన సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్ యాక్ట్ ప్రకారం జీతాలు చెల్లించాలని, ఎనిమిది గంటల పని విధానం అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికులందరిని జెన్‌కో కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలని, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యాలను కల్పించి అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మణుగూరు వైస్‌ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్‌లు పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకయ్య, తరుణ్‌రెడ్డి, వీరంకి వెంకట్రావు, పడిగల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాయంకు మాట్లాడే అర్హత లేదు..

గుండాల: ఆదివాసీల గురించిగానీ, ఆదివాసీల సంక్షేమ పథకాల గురించి గానీ మాట్లాడే అర్హత పాయం వెంకటేశ్వర్లుకు లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2017లో చెట్టుపల్లి ప్రాంతంలో ఫారెస్టు అధికారులు ట్రెంచులు తీస్తుండగా ఆ ప్రాంత ప్రజలు వారి గోడును పాయంకు విన్నవించుకుంటే పెడచెవిన పెట్టారని ఆరోపించారు. నేడు కేసీఆర్ సారథ్యంలో పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని, ఆయనపై ఆరోపనులు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గుండాల: నీటి కుంటల ద్వారా వర్షపు నీటిని నిలువ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాయపాడు గ్రామంలో ఫార్మర్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో వర్షపు నిల్వ, సద్వినియోగం చేసుకోవటంతో పాటు భూసార పరీక్షపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో భాగంగా రాయపాడు రైతులుకు భూసార పరీక్ష వల్ల ఉపయోగాలు నేలల పరిరక్షణ, సమతుల్యత, ఎరువుల వినియోగంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వ హించారు. దీనిలో భాగంగా వర్షపునీరును నిల్వ చేసుకొని వర్షాబావ పరిస్థితుల్లో వినియోగించుకోవటం, ఆక్వాకల్చర్ పెంపకం చేపట్టడానికి కావల్సిన మెళకువలు గురించి వివరించడం జరిగింది. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుమన్, పెండేకట్ల పాపారావు పాల్గొన్నారు.

ప్రతిష్ఠ మహోత్సవాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్ట్ దిగువన నూతనంగా నిర్మించిన శ్రీ గంగానమ్మ తల్లి ఆలయంలో మంగళవారం రాత్రి నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో అమ్మవారి విగ్రహ, నాభిశిల, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని జూన్ 1వ తేదిన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామ శివారుల్లో మామిడి తోరణాలు కట్టి ఉత్సవాలను ప్రారంభించారు. అదే విధంగా ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించే యాగానికి అంతా సిద్ధం చేశారు.

జయప్రదం చేయండి

మణుగూరురూరల్: ప్రజాసమస్యల పరిష్కారం కోసం జూన్ 4వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో జరగబోయే ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం..

జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో జరిగే ప్రజా పోరుగర్జనను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు మండలంలోని బాపనకుంట, రామానుజవరం గ్రామాల్లో మంగళవారం కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆర్.లక్ష్మీనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, చింతల దశరథం, రామానుజవరం సర్పంచ్ బాడిశ మహేష్, వీరమ్మ, లక్ష్మీనాగేశ్వరరావు, బద్రి పాల్గొన్నారు.

జనసమితి ప్లీనరీ..

అశ్వాపురం: జూన్ 4న సూర్యాపేటలో జరిగే తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర మూడో ప్లీనరీని జయప్రదం చేయాలని టీజేఎస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని మొండికుంటలో మంగళవారం పార్టీ ప్లీనరీ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. టీజేఎస్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సురకంటి ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి పిప్పల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

భద్రాచలంఅర్బన్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం భద్రాచల పట్టణంలోని వివిధ కూడళ్లలో సీఐటీయూ పతాకావిష్కరణలు జరిపారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో సీఐటీయూ పట్టణ కన్వీనర్, కోకన్వీనర్లు యంబీ నర్సారెడ్డి, యం.రేణుకలు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం 43 కార్మిక చట్టాలను, నాలుగు కోడ్లుగా మార్చి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఈ విధానాలను వీడకుంటే వచ్చే ఎన్నికల్లో కార్మికులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు ఎన్.నాగరాజు, జి.లక్ష్మణ్, అప్పారి రాము, అజయ్ కుమార్, సీహెచ్.రమేష్, వి.రాము, కాపుల రవికుమార్, జాకీ, సాయి, శ్రీను, రమాదేవి, వాసు, బాలాజీ, గోపాలకృష్ణ, చంద్ర లీల, వెంకటలక్ష్మ, బి.రామకృష్ణ, జక్కుల కృష్ణార్జున రావు, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: సీఐటీయు ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం బూర్గంపాడులో ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య జెండాను ఎగురవేసి మాట్లాడారు. కార్మిక, కర్షక, రైతుకూలి ఐక్యత కోసం, హక్కుల సాధన కోసం సీఐటీయూ ఉద్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో బత్తుల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, పాండవుల రామనాథం, పాలుకొండ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

అశ్వారావుపేటరూరల్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక హమాలి అడ్డా వద్ద ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ చేతుల మీదుగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు, కర్షకులకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, రాంబాబు, హనుమంతరావు, అబ్రహాం, కార్మికులు పాల్గొన్నారు.